

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 । కనిష్ఠం : 20.0

రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు

- ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రవాణాకు అడ్డుకట్ట

అలంపూర్ చౌరస్తా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ధాన్యం రవాణా జరగకుండా ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతలైన నందిన్నె, బల్గెర, ఇర్కిచేడు, సుంకేసుల, పుల్లూరు, బైరాపురం, ర్యాలంపాడు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొననున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయనున్నారు.

పశుగణనతో రైతులకు మేలు

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీవీ రమేష్



డాక్టర్ జీవీ రమేష్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర పశుగణనతో పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుంతోంది. జిల్లాలో పశువులకు సోకే వ్యాధుల నివారణ చర్యలు, పోషణ అవగాహన కార్యక్రమాల ద్వారా రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా సూచనలు చేస్తున్నామని జిల్లా వెటర్నరీ పశుసంవర్ధక అధికారి(డీవీఏహెచ్‌వో) డాక్టర్ జీవీ రమేష్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

జిల్లాలో పశువైద్యశాలలు ఎన్ని ఉన్నాయి..?

జిల్లాలో అసెంబ్లీ నియోజవర్గానికి ఒకటి చొప్పున నాలుగు ప్రాంతీయ పశు వైద్యశాలలు, 34 ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, 52 పశు వైద్య ఉప కేంద్రాలు ఉన్నాయి. కొల్లాపూర్ మినహా మిగతా ప్రాంతీయ పశు వైద్యశాలల్లో పశు వైద్యులు ఉన్నారు. పశు వైద్య ఉప కేంద్రాల్లో 20 మంది పారా సిబ్బంది పని చేస్తున్నారు. మిగతావి ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతానికి ఉన్న సిబ్బందికి ఉప కేంద్రాలలో అదనపు బాధ్యతలు అప్పగించి వైద్య సేవలు అందిస్తున్నాం.

పశు గణన ఎలా కొనసాగుతోంది.?

జిల్లాలో గత నెల 25 నుంచి 28, ఫిబ్రవరి 2025 వరకు పశుగణన ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో పశుగణన కోసం 78 మంది ఎన్యుమరేటర్లను, 20 మంది సూపర్‌వైజర్లను నియమించాం. వీరంతా గ్రామాల్లో ప్రతీ రైతును సంప్రదించి సేకరించిన వివరాలను మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికి 2.50 లక్షల పశువులను గుర్తించాం.

సంచార పశువైద్య సేవలు అందుతున్నాయా?

జిల్లాలోని నాలుగు ప్రాంతీయ పశు వైద్యశాలల్లో నాలుగు సంచార పశు వైద్య అంబులెన్స్ ఉన్నాయి. అంబులెన్స్ వెంట డ్రైవర్‌తో కలిసి ఒక డాక్టర్, పారావేట్, అటెండర్ నలుగురు సిబ్బంది ఉంటారు. ఆయా పశు వైద్యశాలల పరిధిలో ఒక్కడైనా పశువులకు అత్యవసర వైద్య సేవలు అవసరమైతే 1962 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం అందించాలి. వైద్యులు వెంటనే అక్కడికి చేరుకొని వైద్య సేవలు అందిస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల తీసుకుంటున్న చర్యలేంటి?

పశువులకు ప్రధానంగా గాలి కుంటు వ్యాధి ఎక్కువగా సోకుతుంది. నాలుగు నెలలు పైబడిన పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. టీకాల్లో తెల్ల జాతి, నల్ల జాతి రెండు రకాలు ఉంటాయి. జిల్లాలో అక్టోబరు 15 నుంచి ఈ నెల 15 వరకు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకా వేశాం. జిల్లాలో ఇప్పటికీ 1.70 లక్షల పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశాం.

పశు పోషణపై రైతులకు మీరిచ్చే సూచనలు?

రైతులు తమ పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే వాటి పోషణ సక్రమంగా చేయాలి. పశువులకు సీజనల్ వ్యాదులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలి. ప్రతీ నెల సమీపంలోని పశు వైద్య ఉప కేందాల్లో పశువులు ఆరోగ్య పరీక్షలు చేయించాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని పశువైద్య ఉప కేంద్రాల్లో కృత్రిమ పశు గర్భాధారణ సౌకర్యం ఉంది. ఈ సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

SUNDAY SPECIAL
ఆదివారం ప్రత్యేకం

హైదరాబాద్ అంటే బిర్యాని గుర్తొస్తది. కాకినాడ అంటే కాజాలు గుర్తొస్తవి. అదే మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింత కుంట మండలం కురుమూర్తి జాతర అనగానే కాల్చిన మటన్ సీకులు గుర్తుకొస్తవి. ఈ జాతరకు చాలా మంది ఈ సీకుల మటన్ తినడానికి మాత్రమే వస్తారంటే వాటికి ఎంత క్రేజ్ ఉందో తెలుస్తుంది. మూడు నెలల పాటు మక్క పెట్టిన మసాలాలను మటన్‌కు పట్టించి, తర్వాత సీకులకు గుచ్చి, నిప్పులపై కాల్చే వీటిని తిన్నవారు ఆహా! అద్భుతం.. అమోఘం అంటున్నారు. ఒక్కసారి తిన్నవారు మళ్లీ జాతర ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తారంటే అతిశయోక్తి కాదు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి తినేందుకు వస్తున్న ఆ మటన్ చీకులపై 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రత్యేక కథనం మీ కోసం..

- చిన్నచింతకుంట



జాతరలో వెలిసిన మటన్ దుకాణాలు

మటన్ సీకులు.. అదుర్స్

కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్‌కు యమ క్రేజీ

- మూడు నెలల ముందే మసాలా తయారీ
- నిప్పులపై కాల్చే ఈ సీకుల మటన్‌ను తినేందుకు ఇతర రాష్ట్రాల నుంచీ రాక
- ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు పంపుతున్న బంధువులు



నిప్పులపై కాలుస్తున్న సీకుల మటన్



సీకులు కాల్చేందుకు మటన్ కొడుతున్న వ్యాపారి, మటన్‌ను సీకులకు కుచ్చుతున్న మరో వ్యక్తి



మసాలాలు కలిపిన మటన్‌ను సీకులకు గుచ్చుతున్న విక్రయదారుడు

చిన్నచింతకుంట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి జాతర సీకుల మటన్‌కు పేరుగాంచింది. వాటిని తినేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక నుంచీ మటన్ ప్రియులు తరలొస్తున్నారు. జాతరలో ఏటా

(మిగతా 6లో..)

గ్రూప్-3 పరీక్షకు సర్వం సిద్ధం

- రెండురోజుల పాటు పరీక్షలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 154 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 49,864 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు చేసిన అధికారులు



వనపర్తి కలెక్టరేట్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆది, సోమవారాల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ -1 మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్ 2 పరీక్షలు నిర్వహించనున్నారు. పేపర్ 3 సోమవారం ఉదయం 10 గంటల నుంచి

(మిగతా 6లో..)



చిట్లంకుంటలో కిటికీకి తలుపులు లేని అంగన్‌వాడీ కేంద్రం

అధ్వానంగా అంగన్‌వాడీలు

- పెచ్చులూడుతున్న భవనాల పైకప్పు
- పలు కేంద్రాల్లో కిటికీలకు తలుపులే లేవు
- చొరబడుతున్న కోతులు, కుక్కలు
- ఆందోళనలో పిల్లల తల్లిదండ్రులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

6

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల

వెల్దండ, నవంబరు 16 : ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆయన అధికారులకు సూచించారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో మంత్రి నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని రైస్‌మిల్లు వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కల్పించడంతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. రైతులకు మిల్లర్లు సహకరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతిగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు.

పనిచేయని నిఘా నేత్రాలు

- నేను సైతం కార్యక్రమంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు
- మరమ్మతులకు నోచుకోక పెరిగిన చోరీలు



6

పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

● కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కార్యాచరణ మొదలు పెట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలు, బెస్ట్ ఎవైలెబుల్ పాఠశాల స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లా కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతీ విద్యార్థి పరీక్షకు హాజరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఏ ఒక్క విద్యార్థి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ కాకుండా డిసెంబరు 1 నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. గత సంవత్సరం ఆయా విద్యాలయాల్లో విద్యార్థులు ఫెయిల్ కావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా చూసుకోవాలని, అదే సమయంలో చురుకుగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించాలని, వారిని ఐఐటీ, ఎన్ఐటీ, ఉస్మానియా మెడికల్ క్యాంపస్‌లను సందర్శించి స్ఫూర్తి పొందేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. డాక్టర్లు, అదనపు కలెక్టర్, తాను విద్యార్థులతో మాట్లాడి స్ఫూర్తి నింపేందుకు ప్రతీ శుక్రవారం ఒక గంట శేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డీఈవో, జీసీడీవో, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డీకే అరుణ

హామీలు అమలు చేయని ప్రభుత్వం ఉన్నా ఒకటే.. ఊడినా ఒకటే

- పాలమూరు ఎంపీ డీకే అరుణ

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఒకటే ఊడినా ఒకటే అని పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ధ్వజమెత్తారు. ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నిరుపేద మహిళలకు ప్రతీ నెల రూ.2,500 నేటికి అమలు చేయకుండా రాష్ట్ర ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటుందని మండిపడ్డారు. రైతు పండించిన ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని నేడు సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామనడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు నైరాశ్యంతో ఉంటే ప్రజల దృష్టిని మరల్చడానికి సమగ్ర ఇంటింటి సర్వే అంటూ కొత్త నాటకం మొదలు పెట్టారంటూ ఎద్దేవా చేశారు. క్రీడా స్థలం ప్రహరీ నిర్మించేందుకు రూ.10 లక్షల ఎంపీ నిధులను మంజూరు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో దేశాయి పద్మజా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆత్మకూరు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు భగవంత్‌రెడ్డి, మేర్వ రాజు, క్యామ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తుది శ్వాస వరకు అవినీతిపై పోరాడుతా

- పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి
- మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాలువను పరిశీలిస్తున్న మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి

కొల్లాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నా తుది శ్వాస వరకు ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టుల అభివృద్ధి కోసం వాటిలో జరిగే అవినీతిపై పోరాటం చేస్తానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సున్నపు తండా వద్ద పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగం జనార్దన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. పాలమూరు బిడ్డ అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టులపై దృష్టి పెట్టకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతూ కాలయాపన చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ పొడవు మూడున్నర కిలో మీటర్లు తీసి 30 మీటర్ల లోతు తీయాలని ఆయన అన్నారు. మంత్రులు ప్రాజెక్టులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మూడున్నర కిలోమీటర్లు కాలువ పూర్తి చేస్తే నీటిని విడుదల చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేయకపోతే వచ్చే నెల 7వ తేదీన నిరసన చేపడతామని హెచ్చరించారు. తాగునీటిలో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా మాకు కావాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును సందర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్ర పాలకులు 450 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించుకుపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సన్నవడ్లకు బోనస్ రూ.500 చెల్లింపు

- కలెక్టర్ బదావత్ సంతోష్



వడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సన్నవడ్లకు కనీస మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు బోనస్ రూ.500 ప్రభుత్వం చెల్లించనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మండలంలోని మంగనూర్, లట్టుపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 48 గంటల్లో నగదును ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తేమ శాతం పరిశీలించి నిబంధనలకు లోబడి కొనుగోలు సాఫీగా సాగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తీసుకరావాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ బీ శ్రీనివాస్, సీఐ కనకయ్య, ఎస్ఐ కె.శ్రీనివాసులు, నాయబ్ తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో కతలప్ప, సీడీపీవో తదితరులు ఉన్నారు.


మటన్ సీకుల కోసం సిద్ధం చేసిన ప్రత్యేకమైన మసాలా


మసాలా కలిపిన మటన్


మటన్ సీకుల కోసం వచ్చిన కొనుగోలుదారులు

మటన్ సీకులు అదుర్స్

SUNDAY SPECIAL ఆదివారం ప్రత్యేకం

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 40 నుంచి 50 వరకు మటన్ దుకాణాలు వెలుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్న తర్వాత అక్కడే రెండు మూడు రోజులు విడిది ఏర్పాటు చేసుకుంటారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి కాల్చిన మటన్ సీకులను తిని, ఆస్వాదిస్తున్నారు. జాతర మైదానంలోని సాయంత్రం అయ్యిందంటే ఈ మటన్ దుకాణాలు సందడిగా మారుతాయి.

మసాలానే ప్రత్యేకత

జాతరలో కాల్చిన మటన్‌కు అంతక్రేజ్ ఉండటానికి వ్యాపారులు వాడే ప్రత్యేకమైన మసాలానే కారణం. జాతర మూడు నెలలు ఉందనగా, వీరు ఈ మసాలాను సిద్ధం చేసుకుంటారు. నాణ్యమైన పసుపు, దనియాలు, అల్లంపేస్టు, తోక మిరియాలు, ఇలాచీ, దాల్చిన చెక్క, జాజిపువ్వు మిరియాలు, జాపత్రి, మరాటి మొగ్గ, కారంపొడి, ఉప్పు, కాజు, బాదం, కొత్తిమీర, పుదీనా తదితర 18 రకాల ఐటమ్స్‌తో మసాలాను సిద్ధం చేస్తారు. తర్వాత ఆ మసాలాను మట్టికుండలో ఉంచి, మూతకు వస్త్రాన్ని కట్టి, భద్రపరుస్తారు. జాతర ప్రారంభం అయ్యాక బాగా మక్కిన మసాలాను మటన్ ముక్కలకు పట్టించి, వాటిని ఇనుప కడ్డీలకు గుచ్చి, తర్వాత భగభగమండే నిప్పులపై కాలుస్తారు. సుమారు 15 నుంచి 20 నిమిషాల పాటు ఇలా కాలుస్తారు. ఇక అంతే నోరూరించే కాల్చిన మటన్ సిద్ధమవుతుంది. ఈ మటన్‌ను ఒక్కసారి తిన్నవారు మళ్లీ మళ్లీ తినాలనుకుంటారు. మాంసాహారాలకు పట్టణాల్లో పెద్ద పెద్ద హోటల్స్ ఉన్నా.. కురుమూర్తి జాతరలోని కాల్చిన మటన్ తినేందుకు పెద్ద పెద్ద వాహనాల్లో తరలొస్తారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా ఈ మటన్ సీకులను పంపించడం గమనార్హం.

మసాలా దినుసులే ప్రత్యేకత



కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్‌ను మా తాతల కాలం నుంచి అమ్ముతున్నాం. మసాలాతోనే కాల్చిన మటన్‌కు క్రేజీ వచ్చింది. ఎక్కడా వాడని మసాలా దినుసులు ఇక్కడ వాడుతాం. అందుకే కురుమూర్తి జాతర కాల్చిన మటన్‌కు పేరుగాంచింది.

- నరేందర్‌జీ, మటన్‌వ్యాపారి, చిన్నచింతకుంట

శ్రద్ధతో తయారు చేస్తాం



జాతరలో కాల్చిన మటన్ దుకాణం ఏటా ఏర్పాటు చేస్తున్నాం. తాతల కాలం నుంచి జాతరలో కాల్చిన మటన్ విక్రయిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి కూడా ఈ మటన్ తినేందుకు వస్తారు. ఈ మటన్ కోసం ఎంతో శ్రద్ధతో ప్రత్యేకమైన మసాలాను తయారు చేస్తాం. అందుకే దానికి అంత మంచి రుచి వస్తుంది.

- చిన్నరాజు, మటన్ వ్యాపారి, అమరచింత

కర్ణాటక నుంచి వస్తారు



కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్ తినేందుకు కర్ణాటకలోని హుబ్లీ నుంచి వస్తారు. అలాగే హైదరాబాద్, కర్నూల్, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట, రాయిచూరు, మహబూబ్‌నగర్ ఇలా చాలా ప్రాంతాల నుంచి మటన్ ప్రియులు వచ్చి, తింటారు. నేను జాతరలో దాదాపు 40 ఏళ్లుగా మటన్ దుకాణం ఏర్పాటు చేస్తున్నా.

- రాజేష్, మటన్ వ్యాపారి, అమరచింత

మా నాన్న నుంచి నేర్చుకున్నా..



నేను మా నాన్న నుంచి కాల్చిన మటన్ తయారీని చేరుకున్నా. ఇక్కడి మటన్ రుచి ఎక్కడా దొరకదు. మా నాన్న జాతరలో దుకాణం పెట్టేవారు. ఇప్పుడు మేము పెడుతున్నాం. మంచి మసాలాలతో తయారు చేసే ఈ మటన్‌ను తినేందుకే చాలా మంది పట్టణాల నుంచి వస్తున్నారు.

- నేతాజీ, మటన్ వ్యాపారి

పునరావాస కేంద్రం పరిశీలన


దేవునిగుట్ట సమీపంలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

జడ్చర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న ముంపువాసులకు కల్పించే పునరావాస కేంద్రాన్ని శనివారం ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి పరిశీలించారు. మండలంలోని దేవునిగుట్ట సమీపంలోని పునరావాస కేంద్రానికి వచ్చిన కమిషనర్‌కు అదనపు కలెక్టర్ మోహన్‌రావు స్వాగతం పలికి, పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో చేపడుతున్న పనుల పురోగతిని అదనపు కలెక్టర్‌తో కమిషనర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

మాగనూరులో తాగునీటి ఎద్దడి

మాగనూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబానికి తాగునీటి సమస్య లేకుండా చూడాలనే సంకల్పంతో ప్రభుత్వం భగీరథ మంచినీటి పథకం ద్వారా ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చింది. మాగనూరు మండల కేంద్రంలో 167వ జాతీయ రహదారి పక్కన గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైపు ఉన్న ఏరియా ఇళ్లకు మంచినీటి సమస్య కొన్నిరోజుల నుంచి ఉందని.. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు. మంచినీటి సమస్య విషయంపై ఎంపీడీవో రహమతుద్దీన్‌ను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి తిమ్మప్పకు సమస్యను తెలిపి, ఒకట్రెండు రోజుల్లో కాలనీవాసులకు మంచినీరు అందిస్తామని తెలిపారు.


మాగనూరులో ఓ ఇంటి వద్ద అలంకారప్రాయంగా ఉన్న నల్లా

గ్రూప్-3 పరీక్షకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం 12:30 వరకు ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 154 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేవారు. 49,864 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, ఒక చీఫ్ సూపరింటెండెంట్‌లను ఎంపిక చేశారు. పరీక్ష కేంద్రాలు ఉన్న విద్యా సంస్థలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంటన్నర ముందే చేరుకోవాలని అధికారులు తెలిపారు. వారిని సమయంకంటే గంట ముందే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. హాల్ టికెట్‌తో పాటు ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజు ఫొటో, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, ఏదేని గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలి. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు, బ్లూటూత్, కాక్యులేటర్, గడియారాలు, అభారణాలు, షూ, టోపీలు తీసుకురావొద్దని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అభ్యర్థుల సౌకర్యం కోసం ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులను నడుపనుంది. కేంద్రం పరిధిలోని మూడు కిలో మీటర్ల దూరం వరకు ఉన్న జిరాక్స్ కేంద్రలను మూసి ఉంచాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాలు, హాజరుకానున్న అభ్యర్థుల వివరాలు

జిల్లా	కేంద్రాలు	అభ్యర్థులు
మహబూబ్‌నగర్	52	19,465
నారాయణపేట	13	4,039
జోగుళాంబ గద్వాల	25	8,570
వనపర్తి	31	8,312
నాగర్‌కర్నూల్	33	9,478
మొత్తం	154	49,864

రెండో రోజు కొనసాగిన

రుద్రసహిత శతచండీయాగం

● హాజరైన ప్రముఖ పీఠాల అధిపతులు


హాజరైన వివిధ పీఠాల అధిపతులు

జడ్చర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురం సమీపంలోని శ్రీమలయాశస్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమంలో శనివారం శ్రీరుద్ర సహిత శతచండీయాగం రెండవరోజు కొనసాగింది. ఆశ్రమ పీఠాధిపతులు పరమాత్మనందగిరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాగం కార్యక్రమంలో వివిధ ప్రముఖ పీఠాల అధిపతులు హాజరయ్యారు. ఉదయం రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, గీతాపారాయణం నిర్వహించిన అనంతరం శ్రీసీతారాములకల్యాణాన్ని అంగరంగవైభవంగా జరిపించారు. సాయంత్రం కార్తీక శనివారం సందర్భంగా దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవ మూర్తులను భక్తుల అడుగుల భజన, కోలాటాలు, బొడ్డెమ్మలతో ఊరేగించారు. పీఠాధిపతులు సిద్దేశ్వరానందగిరి స్వామి, సదానందస్వామి, అసంగానందస్వామి, పరాశ్రీస్వామి, హర్షబ్రహ్మచారి, రామచైతన్య బ్రహ్మచారి, శ్రీరాములు మహరాజ్‌స్వామి, వరావిధ్యానందగిరి మాతాజీ, బ్రహ్మానందగిరి మాతాజీ, జ్ఞానేశ్వరిబాయి, అనంతానందగిరి మాతాజీ తదితరులు పాల్గొన్నారు.


సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితుడు

పని చేయని నిఘా నేత్రాలు

- నేను సైతంతో సీసీ కెమెరాల ఏర్పాటు
- మరమ్మతులకు నోచుకోక పెరిగిన చోరీలు
- ఈ ఏడాదిలో నమోదైన 183 కేసులు, ఛేదించింది 30 శాతమే



అలంపూర్ చౌరస్తా, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా ముఖ్యమైనది. నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానమని పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పించారు. దీంతో ఆయా గ్రామాల్లో స్థానికులు, వ్యాపారులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. జిల్లాలో 14 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 183 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. ఇందులో కేవలం 30 శాతం కేసులను మాత్రమే ఛేదించారు. ఇందులో చాలా కేసులు సీసీ కెమెరాలు లేనిచోట దొంగతనాలు జరగటమే కారణమని భావిస్తున్నారు.

జిల్లా పోలీసు యంత్రంగం నేనుసైతం కార్యక్రమం ద్వారా సీసీ కెమెరాలను భారీ సంఖ్యలో ఏర్పాటు చేయించారు. పల్లె నుంచి మండల కేంద్రాలు, మునిసిపాలిటీలతో పాటు జిల్లా కేంద్రంలో కూడా కెమెరాలు అమర్చారు. ఇలా మొత్తం జిల్లాలో అధికారికంగా 545 సీసీ కెమెరాలు అమర్చారు. అందులో 428 మాత్రమే పని చేస్తున్నాయని చెబుతున్నారు. మరో 117 మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. కానీ అమర్చిన నెల రెండునెలలు మాత్రమే అవి పని చేస్తున్నాయి. వాస్తవంగా కెమెరా కంపెనీల ప్రతినిధులు అమర్చిన తర్వాత ప్రతీ నెలకోసారి వాటిని పరిశీలించి ఆవరసమైన మరమ్మతులు చేయించాలి. కానీ పోలీసులు అధికారులు కూడా కెమెరాల ఏర్పాటు తర్వాత అటువైపు కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

జిల్లాలో ఈ ఏడాది 183 చోరీలు జరిగినట్లు అధికారికలెక్కలు చెబుతున్నాయి. ఇందులో రూ. 1,81,05,540ల విలువైన వస్తువులు, వాహనాలు, సొమ్ము, నగలు చోరికి గురయ్యాయని వీటిలో కేవలం రూ.53,61,876ల రికవరి మాత్రమే జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా చాల కేసులు దర్యాప్తు దశలోనే ఉన్నాయి. గతంలో అలంపూర్ చౌరస్తాలోని ప్రధానకూడలిలోని ఓ తాళం వేసిన ఇంట్లో బంగారం నగలు, నగదు ఎత్తుకెళ్లారు. మానవపాడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఓ కోల్డ్‌స్టోరేజీలో కత్తులతో బెదిరించి నగదు, బంగారు నగలు దోచుకెళ్లారు. ఇలా జిల్లాలో జరిగిన అనేక చోరి కేసులు ఛేదించాల్సి ఉంది. ఆధారాలు లభించకపోవడం వల్లే చాలా కేసులు పురోగతి సాధించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు



అరు నెలల క్రితం మేమంతా ఇంట్లో లేని సమయంలో బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారు నగలు, రూ.50వేల నగదు దొంగిలిం చారు. ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. నేటికీ నగలు, నగదు దొరకలేదని పోలీసులు చెబుతున్నారు. సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే దొంగలు దొరికేవారు.

- ఈడిగ జ్యోతి, చిరువ్యాపారి, అలంపూర్ చౌరస్తా

మరమ్మతులు చేయిస్తున్నాం



సీసీ కెమెరాలు పనిచేయడం లేదనే మాట వాస్తవమే.. అందుకనుణంగానే వాటిని టెక్నికల్ బృందం సభ్యులుతో మరమ్మతు చేయిస్తున్నాం. ముఖ్యంగా కెమెరాలు అమర్చిన చోట కోతులు తిరుగుతుండటంతో వైర్లు తెంపుతున్నాయి. పబ్లిక్ ప్లేస్‌లలో కెమెరాలు అమర్చే బాధ్యత మాతో పాటు వ్యాపారులు కూడా తీసుకోవాలి. కెమెరాలు పూర్తిస్థాయిలో వినియోగంలో ఉంటే దొంగలను పట్టుకునేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

- రవిబాబు, సీఐ అలంపూర్

పాత నేరస్తులపై నిఘా ఉంచాలి

గోపాల్‌పేట, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : మండలంలో అనుమానితులను, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని వనపర్తి ఎస్పీ గిరిధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. మండలంలో ఏ గ్రామంలో నేరాలు అధికంగా జరుగుతున్నాయని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్ఐ నరేష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లోని కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై గ్రామంలోని ప్రజలకు ఆవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్‌రావ్. సీఐ నరేష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

కొత్తకోట, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : శంకర సముద్రం రిజర్వాయర్ ముంపునకు గురైన కానాయపల్లి గ్రామ పునరావాసంలోని సమస్యలను అధిగమించి నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఆర్అండ్ఆర్ కమిషనరు వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. పునరావాస కేంద్రాన్ని ఆయన శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్వాసితులు... పునరావాసంలోని సమస్యలు కమిషనరు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాసంలో అభివృద్ధి పనులకు ఉన్న ఇబ్బందులపై చర్చించి పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నిర్వాసితుల డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని మంత్రుల బృందానికి నివేదిక ఇచ్చి, త్వరలోనే మంచి కబురు చెబుతామని వివరించారు. నిర్వాసితుల న్యాయమైన కోర్కెలను అమోదించడానికి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కమిషనరును కోరారు. కమిషనరు వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు మదనాపురం మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, జితేంద్రనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాలు

పదర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పల్లె, పట్టణం అనే తేడా లేకుండా నిరుపేద పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుంటారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న బాలబాలికలకు పౌష్టికాహారాన్ని అందించడం, మాతాశిశు మరణాల రేటు తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వ్యవస్థను నడుపుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లినా తమ పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలో క్షేమంగా ఉంటారనే నమ్మకంతో పంపిస్తుంటారు. కానీ కొన్ని చోట్ల అంగన్‌వాడీ భవనాలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవలే అచ్చంపేట క్లస్టర్ పరిధిలో ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించింది. చాలా చోట్ల భవనాలు ప్రమాద భరితంగా ఉన్నాయి. పదర మండలంలోని రాయల గండీ అంగన్‌వాడీ కేంద్రంలో పై కప్పు పెచ్చులూడింది. చిట్లంకుంట గ్రామంలోని అంగన్‌వాడీ భవనానికి కిటికీకీ తలుపు ఊడిపోవడంతో కోతులు, కుక్కలు లోపలికి వస్తున్నాయని చిన్నారుల తల్లిదండ్రులు భయాందళ చెందుతున్నారు. అచ్చంపేట క్లస్టర్ పరిధిలో పదర, అమ్రాబాద్, అచ్చంపేట మండలాల్లో మొత్తం 282 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 85 సొంత భవనాలు ఉండగా.. 25 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరో 85 భవనాలు, వివిధ సంఘాల వారు, స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా 87 కేంద్రాలు పాఠశాలలో కొనసాగిస్తున్నట్లు సమాచారం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 803 మంది గర్భిణులు, 531 మంది బాలింతలు, 0-6 నెలల వయస్సు గల పిల్లలు 485 ఉండగా.. ఏడు మాసాల నుంచి మూడేళ్ల వయస్సు గల పిల్లలు 3,758 మంది, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు 4004 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు పొందుతున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. శిథిలావస్థలో ఉన్న భవనాలకు వెంటనే మరమ్మతు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రాయలగండీ తండా అంగన్‌వాడీ కేంద్రంలో పెచ్చులూడటంతో ఆరుబయట భోజనం చేస్తున్న చిన్నారి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఇప్పటి వరకు అచ్చంపేట క్లస్టర్ పరిధిలో శిథిలావస్థకు చేరిన 75 భవనాలను గుర్తించాం. వాటి మరమ్మతు కోసం పూర్తి సమాచరం ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. నిధులు మంజూరీ అయిన వేంటనే మరమ్మతులు చేయిస్తాం.

- లక్ష్మీ, సీడీపీవో, ఐసీడీఎస్ అచ్చంపేట

కిటికీలకు అట్టలు అడ్డం పెట్టారు



కుక్కలు, కోతులు పసిపిల్లల్ని గాయపరుస్తున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. మా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం భవనానికి కిటికీలకు తలుపులు లేకపోవడంతో కోతులు, కుక్కలు లోపలికి చొరబడుతున్నాయి. చిన్నారులను కరిస్తే ఎవరు బాధ్యత వహిస్తారు. కిటికీలకు అట్టలు అడ్డం పెడితే ఎన్నిరోజులు ఉంటాయి. ఉన్నతాధికారులు స్పందించాలి.

- రాసమూరి అంజనేయులు, చిట్లంకుంట గ్రామం

నూతన భవనాలు నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన భవనాలకు వెంటనే మరమ్మతులు చేయించాలి. వీలైనంత త్వరగా నూతన భవనాలను నిర్మించాలి. ముఖ్యంగా చెంచు పెంటల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పించాలి.

- వరుణ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ, పదర

పేదల పక్షాన నిరంతర పోరాడుతాం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

తెలకపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షాన నిరంతం సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి అన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని గౌరెడ్డిపల్లిలో ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మాడుగుల పర్వత్ రెడ్డి మాతృమూర్తి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి పరిపాలన సాగిస్తోందన్నారు. ప్రధాన మోదీ జమిలీ ఎన్నికలు నిర్వహించాలని అంటున్నారని, ఇది సాధ్యమయ్యే పని కాదని అన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ రూ.31కోట్ల మేరకు ఉన్న కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే రుణ మాఫీ చేసిందని, మిగతా వారికి వెంటనే రుణ మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల నరసింహ, ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సదా నందగౌడ్, మాజీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు పండించిన ప్రతీ గింజ కొంటాం

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి


మొల్గరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

ఉప్పునుంతల/ లింగాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించే పంటలో చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని మొల్గర, మామిళ్లపల్లి, కంసానిపల్లి, లింగాల మండలం కేంద్రం, సూరాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవ సాయ మార్కెట్‌కు పంటల ఉత్పత్తులను తీసుకువచ్చే రైతులకు అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదే శించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. సన్న వడ్లకు మద్ధతు ధరతో పాటు బోనస్‌గా క్వింటాలుకు రూ.500 చెల్లించి కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రజిత, ఆర్డీవో మాధవి, పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ దొడ్ల నర్సయ్య యాదవ్, నాయకులు కొత్త రవీందర్‌రావు, గోపిరెడ్డి, రమేష్ రెడ్డి, కృష్ణ, అనంత ప్రతాప్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హనుమంతురెడ్డి, అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు సంఘటనల్లో

ఇద్దరు వ్యక్తుల మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఇటిక్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని షాబాద గ్రామానికి చెందిన తెలుగు నాగన్న (86) ఎర్రవల్లి నుంచి షాబాద గ్రామానికి ఆటోలో వెళుతుండగా మునుగాల గ్రామ శివారులో వెనుక వైపు కూర్చున్న నాగన్న చెప్పు కింద పడటంతో అందుకునే సమయంలో రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుమారుడు రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అలాగే మునుగాల శివారులో 44వ జాతీయ రహదారిపై ఇటిక్యాల స్టేజీ దగ్గర శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్లే బస్సు నుంచి దిగి మలమూత్ర విసర్జన చేసి ప్రమాదవశాత్తు అక్కడే కింద పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు వయస్సు 60 ఏళ్ల లోపు ఉండవచ్చుని, పూర్తి వివరాలకు ఇటిక్యాల ఠాణాను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వృద్ధుడు..


చిన్న మల్లయ్య (ఫైల్)

కోడేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం గాలిలో కలిసి పోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రానికి చెందిన కురువ బెట్టరి చిన్న మల్లయ్య (75)ను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కోడేరు ప్రధాన రోడ్డు దాటుతుండగా, జనంపల్లి నుంచి కోడేరు వెళ్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే అతడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జనంపల్లి నుంచి కోడేరు వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ రోడ్డు దాటుతున్న మల్లయ్యను ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ అనిల్ నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం బలైందని అక్కడ ఉన్న స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని కొల్లాపూర్ తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ గోకారి తెలిపారు. మృతి చెందిన మల్లయ్యకు భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పి.నర్సింహ కోరారు.

కుంటలో పడి యువకుడు..

జడ్చర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా జడ్చర్ల మండలం కొండేడు గ్రామ శివారులోని కుంటలో పడి అదే గ్రామానికి చెందిన మంచాల రమేశ్(23) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు... శనివారం ఉదయం కుంట ఒడ్డున రమేశ్‌కు చెందిన చెప్పులు, దుస్తులు ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు, కుంటలో రమేశ్ కోసం వెదికారు. కాగా రమేశ్ మృతదేహం బయటపడటంతో తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరికి తీవ్ర గాయాలు


నుజ్జు నుజ్జయిన కారు

అచ్చంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారును బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామం శ్రీశైలం ఘాట్ రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, నాదర్‌గుల్‌కు చెందిన కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కారులో శ్రీశైలం వెళ్తున్నారు. అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో ఘాట్ మూలమలుపు వద్ద పికెట్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం వెళుతుండగా వెనుకనుంచి కారును ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న కృష్ణారెడ్డితో పాటు మల్లేష్, చందన, మానస, సంధ్యలుండగా, వీరిలో సంధ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కి తరలించారు. ఆ మేరకు రక్తస్రావం అధికంగా అవుతుండటంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు వారు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ : కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న మహారాష్ట్ర బ్యాంక్ మేనేజర్ ఎస్.రాకేష్ గత అక్టోబరు 27వ తేదీన తన తల్లికి అనారోగ్యం ఉందని సమాచారం రావడంతో హైదరాబాద్ వెళ్లారు. ఇంటి ముందు హోండా యాక్టివా ఉంచి వెళ్లిపోయాడు. నవంబరు 14వ తేదీన ఇంటికి వచ్చి చూడగా తన బండి కన్పించలేదు. చుట్టుపక్కల కాలనీలో విచారించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


సింగారం చౌరస్తా హోటల్‌లో జోడి టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి(ఫైల్)

ఎప్పుడు వెళ్లినా ఇక్కడ ఆగి టిఫిన్ ఆరగిస్తాం..



నారాయణపేటకు వివిధ పనుల నిమిత్తం స్నేహితులు, కుటుంబ సభ్యులతో వచ్చినప్పుడు సింగారం చౌరస్తాలో ఆగి రుచికరమైన వగ్గాని, బజ్జీలు తిని వెళ్తుంటాం. చౌరస్తాలో రెండు హోటళ్లలో భలే రుచి ఉండటం వల్ల ఈ ఫేమస్ జోడి టిఫిన్ ఆరగించి వెళ్తుంటాం.

- సత్యానారాయణ, వడ్వాట్ గ్రామం, మాగనూర్ మండలం, నారాయణపేట



ఉగ్గాని, బజ్జీలు

నూనెలో బజ్జీలను వేసితీస్తూ...

జోడి టిఫిన్.. నోరూరించెన్

నారాయణపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నోరూరించే గరం గరం ఉగ్గాని బజ్జీలు తిందాం అంటూ ఎవరి నోటా విన్నా వినిపించే ఈ మాటలతో జోడి టిఫిన్ జోష్ నింపుతున్నది. కర్ణాటక సరిహద్దులో ఉన్న నారాయణపేట ప్రాంతంలో ఈ జోడి ఉగ్గాని బజ్జీలు ప్రత్యేకం అని చెప్పవచ్చు. అరగంటలో అందరూ చూస్తుండగానే గరం..గరం.. జోడి టిఫిన్ అందిస్తూ ఈ వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. ముఖ్యంగా ప్రముఖులు సైతం నారాయణపేట ప్రాంత పర్యటనలో బలే రుచిగా ఉండే గరం గరం బజ్జీలను ఉగ్గానితో ఆరగిస్తుండటం విశేషం. ఇళ్లకు వచ్చే అతిథులకు సైతం ఈ ప్రాంత జోడి టిఫిన్ రుచి తినిపిస్తుంటారు. జిల్లాలోని నారాయణపేట, సింగారం చౌరస్తా, ఊట్కూర్, మాగనూర్, కృష్ణ, ధన్వాడ, మరికల్, దామరగిద్ద, మద్దూరు బస్టాండ్ ప్రాంతాల్లో జోడి టిఫిన్ హోటళ్లు ప్రత్యేకంగా ఉండటం చూస్తుంటే ఏ మేరకు టిఫిన్‌కు డిమాండ్ ఉందో అర్థమౌతుంది.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఆకలి తీర్చే జోడి టిఫిన్ సింగిల్ రెండు మిర్చి బజ్జీలు, ఉగ్గానిని రూ.30లకే అందిస్తుండటంతో ఈ అల్పాహారాన్ని భుజించి కడుపు నింపుకుంటారు. అయితే బొంగులు, టమాటా, ఉల్లిగడ్డలు, మిర్చీలు, నూనెతో గరం గరం ఉగ్గాని తయారు చేసి శనగపిండితో తయారుచేసే బజ్జీలను విభిన్న రీతుల్లో పచ్చిమిర్చిల బజ్జీలు, గోల్‌బజ్జీలు, ఆలు బజ్జీలు, కట్ మిర్చి బజ్జీలు, పాలక్ చుర్ బజ్జీలు, గోబి చుర్ బజ్జీలు, తమల పాకుల చుర్ బజ్జీలు, ఉల్లిపాయలు శనగపిండితో కలిపి పకోడి బజ్జీలు ఇలా ఎన్నో వెరైటీలు అందిస్తుంటారు.

మిర్చి బజ్జీలు, చోటా బజ్జీలకే అధిక డిమాండ్ నెలకొంది.

చిన్న హోటల్‌తో ప్రారంభమై..



సింగారం చౌరస్తాలో 20 ఏళ్లుగా చిన్నహోటల్‌తో ప్రారంభించి నేడు పెద్దదిగా చేశాను. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తీరిక లేకుండా నలుగురు పని వాళ్లతో హోటల్ నడిపిస్తున్నా. నాణ్యత పరంగా ఎక్కడా రాజీ లేకుండా టిఫిన్ తయారు చేసి రూ. 30కి ప్లేట్‌లో ఉగ్గాని, రెండు మిర్చీ బజ్జీలు ఇస్తున్నాం. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిగుండా వెళ్లేవి. ఆపి మర్రి జోడి టిఫిన్ తిని వెళ్తుంటారు.

- సుదర్శన్ గౌడ్, హోటల్ యజమాని, సింగారం చౌరస్తా, నారాయణపేట

గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి రావాలి

- క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం
- డీఎఫ్‌వో సత్యనారాయణ
- ఉత్సాహంగా ఇషా ఫౌండేషన్ వాలీబాల్ పోటీలు


వాలీబాల్ విజేత చిన్నరేవల్లి క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న డీఎఫ్‌వో

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులు వెలుగులోకి రావాలని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) సత్యనారాయణ అన్నారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో 16 గ్రామోత్సవ గ్రామీణ జిల్లా స్థాయి పురుషుల వాలీబాల్ ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. పోటీలను డీఎఫ్‌వో సత్యనారాయణ, డీవైఎస్‌వో శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరక్టర్ మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు. జిల్లా క్రీడా శాఖ అధికారి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. నిరంతర సాధనతో క్రీడల్లో రాణిస్తారని, గ్రామీణ క్రీడాకారులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజేతకు రూ.9 వేలు, రన్నర్ జట్టుకు 6వేలు, మూడో స్థానం జట్టుకు రూ.3వేలు, 4వ స్థానంలో నిలిచిన జట్టుకు 2వేల నగదు ట్రోఫి అందజేశారు. విజేత, రన్నర్ జట్లు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ రాజగోపాల్, డీఎంహెచ్‌వో కృష్ణ, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, పీడీలు వేణుగోపాల్, రాంచందర్, నిరంజన్‌రావు, వడెన్న, ముస్తాఫా, ఇషా వలంటీర్లు రమేష్, గిరిధర్ పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత చిన్నరేవల్లి


రన్నర్ నవాబ్‌పేట జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 16 గ్రామోత్సవ గ్రామీణ జిల్లా స్థాయి పురుషుల వాలీబాల్ ప్రీమియర్ లీగ్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్ చిన్నరేవల్లి జట్టు నవాబ్‌పేటపై 15-13, 15-8 సెట్ల తేడాతో గెలిచి చాంపియన్‌గా నిలిచింది. నవాబ్‌పేట జట్టు రన్నర్ నిలిచింది. మూడో స్థానంలో నంచర్ల-2, నాల్గో స్థానంలో పోలేపల్లి జట్టు నిలిచింది. విజేతలకు జిల్లా అటవీశాఖ అధికారి ట్రోఫీలు ప్రదానం చేశారు.

జాతీయ స్థాయి ఆర్చరీ టోర్నీలో జిల్లా విద్యార్థి ప్రతిభ


సిల్వర్ మెడల్ సాధించిన రవి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలో శనివారం జరిగిన జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 ఆర్చరీ పోటీల్లో జిల్లాకు చెందిన ఆర్చరీ క్రీడాకారుడు రామవత్ రవి సిల్వర్ మెడల్ సాధించాడు. జిల్లా కేంద్రంలోని న్యూ రిషి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించడం పట్ల ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి, కోచ్ జ్ఞానేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

కొత్తగా..

చెట్టు కాదు దిమ్మె



వనపర్తి మండలం చిట్యాల గ్రామం వెళ్లే దారిలో అటువైపుగా వెళ్లే వారికి మాత్రం కొట్టేసిన చెట్టుపై కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ బిగించినట్టుగా కనిపిస్తుంది. ఇది సిమెంట్‌తో చెట్టు ఆకారంలో దిమ్మె ఏర్పాటు చేశారు. కృత్రిమంగా చేసిన చెట్టు ఆకృతి చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫోటోగ్రాఫర్, వనపర్తి

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి


సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పరిపూర్ణానందగిరి స్వామి వారిని తులాభారం వేయిస్తున్న భక్తులు

తాడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో మానవులుగా జన్మించిన ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి సూచించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లాలో ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులైన మలయాళ స్వామి పరంపర కొనసాగిస్తున్న పరిపూర్ణానందగిరి స్వామి కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి హాజరు కావడం జరిగింది. దీంతో ఆలయ అర్చకులు జగదీశ్వర్, భక్తులు స్వామివారిని పూర్ణకుంభంతో స్వాగతం పలికి అనంతరం పరిపూర్ణానందగిరి స్వామి ఆలయం నందు ఉన్న గణపతి లక్ష్మీనరసింహ స్వామి మూల విరాట్‌తో పాటు మహాశివలింగాన్ని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన కేశ మల్లయ్య అనే భక్తుడు స్వామి వారికి రూపాయి బిల్లలతో తులాభారాన్ని చేయించారు. ఈ తూలాభారంలో స్వామి వారి బరువుకు 16 వేల రూపాయల బిల్లలు అవసరమయ్యాయి. అనంతరం పరిపూర్ణానందగిరి మాట్లాడారు. అనంతరం గీతాయజ్ఞ నిర్వాహకులు ఆలయం నందు గీతాయజ్ఞ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. పాల్గొన్న భక్తులందరికీ ఆలయంలో అన్నప్రసాదాలను అందజేశారు.

వెచ్చని నేస్తాలు

- చలిని తట్టుకునేందుకు ఉన్ని దుస్తులు
- రంగు రంగుల ఉలెన్ స్వెటర్లు
- ఆకర్షించే బొమ్మలతో స్వెటర్లు
- రోజు రోజుకు పెరుగుతున్న చలి తీవ్రత
- ఊపందుకుంటున్న కొనుగోళ్లు
- నాణ్యతను బట్టి ధరలు
- మహిళలకు అందుబాటులో అధిక మోడల్స్


మఫ్లర్‌లు



గడియారం చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాల్లో వెలసిన దుకాణాల్లో వివిధ రకాల స్వెటర్లు, టోపీలు


పలు రకాల ఉలెన్ దుస్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భగభగ మండే ఉష్ణ తాపాన్ని తట్టుకున్న ప్రజలకు వర్షాకాలంలో చల్లని జల్లులతో ప్రారంభమైన వానాకాలం.. జడివానలై వరదలై అల్లకల్లోలం సృష్టించాయి.. వాటి గాయాలు మానక ముందే వాతావరణంలో చల్లని గాలులు మొదలయ్యాయి. ఈ గాలులు తట్టుకోవడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఉన్ని దుస్తుల వైపు ఆకర్షితులవుతున్నారు. డార్జిలింగ్, టిబెట్, పంజాబ్ రాష్ట్రం లుధియాన, హరియాన రాష్ట్రం పానీపాడ్ తదితర ప్రాంతాల నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి భారీగా ఉన్ని దుస్తులు దిగుమతులు అవుతున్నాయి.

ఈ వస్త్రాలు పట్టణంలోని గడియారం చౌరస్తా, మిలాప్ హోటల్, పోస్టాఫీస్ రోడ్డు వెంట, ఫారెస్ట్ ఆఫీస్ ముందర, బస్టాండ్ ఎదురు గా, ఆర్‌అండ్‌బీ కార్యాలయం ముందర తదితర ప్రాంతాల్లో షెడ్లు వేసి విక్రయిస్తున్నారు. ఈ విక్రయ కేంద్రాల వద్ద ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

నాణ్యతను బట్టి ధరలు

చలి తీవ్రత నుంచి కాపాడుకోవడానికి ప్రజలు కొనుగోలు చేసే ఉన్ని దుస్తులు నాణ్యతను బట్టి అందుబాటులో ఉన్నాయి. మహిళలకు రూ.300 నుంచి రూ.600 తర్వాత రూ.700ల వరకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మహిళలకు పది రకాల ఉలెన్ స్వెటర్లు లభిస్తున్నాయి. వీటిలో వీనెక్, రౌనెక్, ఖాదర్, జిప్‌మాడల్, క్యాప్‌మాడల్, జాకెట్ మాడల్, స్కార్ఫ్ మాడల్, హ్యాండ్‌బ్లౌజ్, టోపీలు, సాక్స్‌లు ఉన్నాయి.


ఉలెన్ దుప్పట్లు

పురుషులకు ప్రత్యేకంగా మంకీ క్యాప్స్, హ్యాండ్‌బ్లౌజ్, సాక్స్‌లు, మాఫ్లర్‌లు అందుబాటులో ఉన్నాయి. పురుషుల స్వెటర్లు రూ.400 నుంచి రూ.700 తర్వాత రూ.800 వరకు లభిస్తాయి. చిన్న పిల్లలవి రూ.250 నుంచి రూ.550 వరకు అందుబాటులో ఉన్నాయి. అలాగే, బ్లాంకెట్స్ రూ.150 నుంచి రూ.550 వరకు లభిస్తున్నాయి.

జనవరి 15 వరకు వ్యాపారం



అక్టోబరు చివరి వారం నుంచి వ్యాపారాలు ప్రారంభమై జనవరి 15 వరకు జోరుగా సాగుతుంది. ఫిబ్రవరి మొదటి వారంలో వ్యాపారాన్ని మూసివేస్తాం.

- సిరాజ్ అహ్మద్, రాయచూరు, కర్ణాటక రాష్ట్రం

డార్జిలింగ్ నుంచి దిగుమతి



మేము సీజనల్ వ్యాపారం చేస్తాం. డార్జిలింగ్, టిబెట్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన పెద్ద వ్యాపారులు అక్కడి నుంచి దిగుమతి చేసుకుని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో వారు వ్యాపారాలు నిర్వహిస్తారు. వారు ఇచ్చే కనీస వేతనానికి మేము పని చేస్తాం.

- రోషన్, గుర్మిటకల్, కర్ణాటక

ఇంటర్వ్యూ..



పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం..

- షేక్ మున్నా, ఏవో

పెబ్బేరు రూరల్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి షేక్ మున్నా శనివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

మండలంలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు?

సింగిల్ విండో, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మొత్తం 35 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రారంభించాం.

దొడ్డు, సన్న రకాలను ఎలా కొనుగోలు చేస్తారు?

మండల వ్యాప్తంగా 70 శాతం దొడ్డు రకం ధాన్యం, 30 శాతం సన్న రకం ధాన్యాన్ని రైతులు సాగుచేశారు.

ఈ ఏడాది వర్షాకాలంలో వరద తాకిడికి వరి పంట ఎంత నష్టం వాటిల్లింది?

ఈ ఏడాది మండల వ్యాప్తంగా 242 ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లింది.

ఎన్ని క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తారని అంచనా వేశారు.?

దొడ్డు రకం 30 వేల మెట్రిక్ టన్నులు, సన్నరకం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తారని అంచనా వేశాం.

ఘనంగా అయ్యప్ప పడి పూజ



పూజలు అందుకుంటున్న అయ్యప్ప

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, పదునెట్టాంబడి పడి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది భక్తులు హాజరై లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొల్లంపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి మరియు గుప్త గురుస్వామి, ఆడప కార్యదర్శి గట్టు వెంకన్న, ఆలయ పూజారి రమేష్, కొన్నెలర్లు కాశితల లక్ష్మీనారాయణ, ఉంగ్రం ఆలీఖ్య, మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, చీర్ల జనార్దన్, కృష్ణసాగర్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఖిల్లాఘనపురం నవంబరు16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన నలుగురు వ్యక్తుల అనారోగ్యానికి గురై కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు పొందిన వారు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన వ్యక్తులకు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్‌కు రూ.60 వేలు, శంషాద్‌బేన్‌కు రూ.58వేలు, రాకాలి తిరుపతయ్యకు రూ.28వేలు, సాయికిరణ్‌కు రూ.16వేల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలు పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేస్తారని తెలిపారు. పేదప్రజల సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంజాయి రమేష్, నాయకులు నరేందర్ గౌడ్, కామ్ రాజు, ప్రకాష్, శరవంద, అజీమ్, ముజాహిద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన రావుల



యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రావుల

వనపర్తి అర్బన్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : ఐజీఎల మృతి చెందిన పట్టణానికి చెందిన పలువురు బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. శనివారం పట్టణానికి చెందిన అర్బన్ సంఘం నాయకుడు గోనూరు యాదగిరి ఐటీఐలో గుండెపోటుతో మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదే విధంగా షైనార్టీ నాయకుడు సలీం ఐటీఐలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, నందిమల్ల అశోక్, గౌస్, జమీల్ ఉన్నారు.

పెబ్బేరు టౌన్ : రామాపురం గ్రామ మాజీ సర్పంచ్ గోపాల్ నూతన గృహప్రవేశం సందర్భంగా శనివారం మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి నూతన గృహ ప్రవేశం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పెబ్బేరు : మండలంలోని వివిధ కార్యక్రమాల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి లు పాల్గొన్నారు.

బిగుసుకుపోయిన గేట్లు.. పారుతున్న నీరు

- పొలాల్లోకి చేరుతున్న నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు - అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆవేదన



కుడి కాల్వ ద్వారా విడుదలవుతున్న నీరు



రైతుల పొలాల్లోకి చేరుతున్న నీరు

ఆత్మకూరు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : రామన్‌పాడు రిజర్వాయర్ కుడి కాల్వ గేట్లు మూసుకోపోవడంతో కోతకొచ్చిన పంటల్లోకి కాల్వ నీరు చేరి కోతలు కొనసాగేందుకు వీలు లేకుండా పోయిందని కుడి కాల్వ ఆయకట్టు పరిధి రైతులు వాపోతున్నారు. రామన్‌పాడు రిజర్వాయర్ కుడి కాల్వ పరిధిలో తిప్పడంపల్లి, ఆరేపల్లి, కత్తెపల్లి, మేడపల్లి, మోట్లంపల్లి గ్రామాల ఆయకట్టు 1,800 ఎకరాలు సాగు అవుతున్నాయి. పంట లు పూర్తయి కోత సమయానికి వచ్చినా.. కాల్వ నీరు బంద్ కావడంలేదని, దీంతో తీవ్ర ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తే, చేతికి వచ్చే సమయంలో పొలా ల్లోకి నీరు చేరుతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి కాల్వ నీటిని నిలుపుదల చేయా లని, ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం..

కుడి కాల్వ గేట్లు మూసేందుకు ఎంత ప్రయత్నించినా.. మూసుకోవడం లేదు. రైతుల పొలాల్లోకి నీరు చేరకుండా ఎక్స్‌కవేటర్‌తో కాల్వ నీటిని పక్కదారి మళ్లించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాం. కుడి కాల్వ గేట్లు 20 పీట్ల నీటి అడుగులో ఉంటుంది. గజ ఈతగాళ్లను రప్పించి మరమ్మతు చేపట్టేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాం.

- నారాయణ, ఇరిగేషన్ డీఈ

కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి



పాన్‌గల్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

పాన్‌గల్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తాము నిల్వ ఉంచిన కొనుగోలు కేంద్రాల్లో రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద అక్కడక్కడా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పిర్యాదులు వస్తున్నందున ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద పాయింట్ బుక్కు ఏర్పాటు చేసి, పోలీసుల పర్యవేక్షణలో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వర్మ, అంజి, రైతులు స్వామి, రాంచందర్‌యాదవ్, వెంకటయ్య, రాములు తదితరులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



వెల్టూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

వీపనగండ్ల, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని, దళారులను నమ్మి ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకొని మోసపోవద్దని సింగిల్‌విండో సొసైటీ మాజీ చైర్మన్ బాలిరెడ్డి రైతులకు తెలిపారు. శనివారం మండల పరిధిలోని గోపాల్‌దిన్నెలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహిళా సమాఖ్య గ్రామ అధ్యక్షురాలు సునీత ప్రారంభించారు. ఏపీఎం బుచ్చన్న, సీసీ వీరయ్య, మహిళా సంఘం సభ్యులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

పెద్దమందడి : రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని వనపర్తి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొత్తకోట రామకృష్ణారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని వెల్టూరు వివర్స్ కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

రామకృష్ణాపూర్‌లో..

కొత్తకోట : మండలంలోని రామకృష్ణాపూర్‌లో పామాపురం సింగిల్‌విండో ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. బీచుపల్లి యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కురుకాత్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, శివరాములు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నంబావి : మండల పరిధిలోని పెద్దదగడ, చిన్నదగడ, మియాపూర్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ బగ్గరి నరసింహారెడ్డి ప్రారంభించారు.

గ్రూప్- 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్షలను జిల్లా లో ఈ నెల 17, 18వ తేదీల్లో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రూప్- 3 పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక అధికారులు, రూట్ ఆఫీసర్లు, అన్ని పరీక్ష కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, ప్లయింగ్ స్క్వాడ్లతో సమావేశం నిర్వహించారు. అ దనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్- 3 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోని ఉద యం 8.30 నుంచి 9.30 వరకు అనుమతించాలన్నారు. 9.30 కు గేట్లు మూసివేయాలని ఆదేశం చారు. మధ్యాహ్నం పరీక్షకు 1.30 నుంచి 2.30 వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించి 2.30 గం టలకు గేట్లు మూసివేయాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాల న్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు త ప్పనిసరిగా ఉండాలని తెలిపారు. సంబంధిత అధికారుల సమక్షంలో ప్రశ్నాపత్రాలను సీసీ కెమెరా ముందు ఓపెన్ చేయాలని ఛీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచించారు. పరీక్ష హాల్లోకి విద్యార్థి హాల్ టికెట్, పెన్ను, ఏదైనా గుర్తింపు కార్డు త ప్ప మరే వస్తువులు పరీక్ష కేంద్రంలోని అనుమతించరాదని ఆదేశించారు. ప్రతి అభ్యర్థికి బయో మెట్రిక్ హాజరు తప్పనిసరిగా తీసుకోవాలని, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. వనపర్తి జిల్లాలో 8,312 మంది విద్యార్థులు గ్రూప్-3 పరీక్షలు రాసేందుకు 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రూప్ 3 పరీక్ష ప్రాంతీయ సమన్వయకర్త రామ్ నరేష్ యాదవ్, ఛీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, ప్లయింగ్ స్క్వాడ్స్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయలేని ప్రభుత్వం

పెబ్బేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, ఇప్పటి వరకు ఒక గింజను కూడా ఖరీదు చేయని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రె స్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్ విమర్శించారు. శనివారం పెబ్బేరు వైస్ ఛైర్మన్ ఛాంబర్‌లో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుల కు కష్టాలు తప్పవని ఎన్నికల సమయంలో మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని, ప్రస్తుతం అదే కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెంకాయలు కొడుతున్నారు తప్పా గోనె సంచులు, పరికరాలు లేవన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, శుక్రవారం వచ్చిన వర్షానికి వరి ధాన్యం తడిసిపోయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీలో రైతులను మోసం చేశారని, ఇంత వరకు రైతుబంధు వేయలేదని తెలిపారు. పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్, సాయినాథ్, దిలీప్ రెడ్డి, విశ్వరూపం, ఎల్లారెడ్డి, వడ్డె రమేష్, చెన్న పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు కృషి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారిణి సుమ

వనపర్తి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల భవిష్యత్తుకు అవరోధమని, బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పెషలిస్టు ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ అధికారి సుమ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి ప్రోగ్రాంలో భాగంగా శనివారం వనపర్తిలోని లిటిల్ బర్డ్ పాఠశాలలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహం వల్ల గర్భం దాల్చిస్తే తల్లి, బిడ్డకు ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. చదువుకొని ఎంతో ఉన్నతికి చేరాల్సిన వారి భవిష్యత్తు ఆగిపోతుందన్నారు. బాల్య వివాహం నిర్వహిస్తే నమోదు చేయాలన్నారు. జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చాలని, దానికి అందరూ కూడా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణను విస్మరిస్తే ప్రభుత్వ పతనం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు సురేష్ మాదిగ

వనపర్తి టౌన్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను విస్మరిస్తే రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు సురేష్ మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అన్ని అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం కొమ్ము చెన్నకేశవులు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో అధికంగా ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు రిజర్వేషన్లు కల్పించకుండా, సామాజిక న్యాయానికి విరుద్ధంగా వ్యవహరించిందని అన్నారు. మాదిగలు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తే పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉండి కూడా పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మాలలను నెత్తిమీద ఎత్తుకొని, మాదిగ జాతిని మాత్రం పాదాల కింద అణచివేసిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ జాతి ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ, జంగయ్య మాదిగ, గట్టయ్య మాదిగ, లక్ష్మణ్ మాదిగ, నరసింహ మాదిగ పాల్గొన్నారు.

షరతులు తొలగించి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్వజన

వనపర్తిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జన గణన, నియోజకవర్గాల పునర్విభజన షరతులను తొలగించి 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వజన డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ విస్తృత స్థాయి జిల్లా సమావేశం శనివారం జిల్లా కార్యదర్శి గీత అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 9 ఏళ్ల మహిళా రిజర్వేషన్లను గుర్తించి పట్టించు కొని బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల ముందు ఓట్ల కోసం సెప్టెంబరు 19, 2023న చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించింది దన్నారు. మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు కోసం మహి ళలు ఉద్యమానికి తం పోరాడాలన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య 22వ మహాసభలు డిసెంబరు 6, 7, 8వ తేదీల్లో ఢిల్లీలో జరుగనున్నాయని తెలిపారు. కళావతమ్మ, కె.విజయరాములు, రమేష్, గోపాలకృష్ణ, జయమ్మ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రూప్ 3 పరీక్షకు పటిష్టమైన బందోబస్తు

వనపర్తి క్రైమ్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : గ్రూప్- 3 పరీక్షకు జిల్లాలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద 200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ నిబంధనలు అమలులో ఉన్నాయని, అక్కడ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమ నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

సోమవారం ప్రజావాణి రద్దు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 3 పరీక్షలు ఈ నెల 17, 18వ తేదీల్లో కొనసాగనున్న నేపథ్యంలో 18న సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు అందరూ గ్రూప్- 3 పరీక్షల నిర్వహణలో ఉంటారని, అందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ పిర్యాదులు తీసుకుని దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : విశేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే మైనార్టీ విద్యార్థుల అందుకు అవసరమైన ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, టోఫెల్ వంటి పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బుద్ధిస్ట్, జైన్, మైనార్టీ విద్యార్థులు తమ దరఖాస్తులను డైరెక్టర్‌ఎంసీసీసీసీ తెలంగాణ వెబ్‌సైట్‌లో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసిన హార్డ్ కాపీలకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మె మోల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్, రెం డు ఫోటోలను జత చేసి ఈ నెల 18వ తేదీ నుం చి 30వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, 3వ ఫ్లోర్, జామియా నిజామియా కాంప్లెక్స్, గన్ ఫౌండ్రీ, అబిడ్స్ హైదరాబాద్‌లో అందచేయాలని తెలిపారు.

పాఠశాలలో సామగ్రి ధ్వంసం

కొత్తకోట, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు గదుల తలుపులు, విద్యుత్ బోర్డులు, ట్యూబ్ లైట్లు, నల్లా పైపులు, బండలు ధ్వంసం చేసి గోడలపై ఉన్న దేశ నాయకుల బొమ్మలకు బురదను అంటించారు. శనివారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గమనించి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. వారి విజ్ఞప్తి మేరకు పాఠశాల హెచ్‌ఎం భీమన్న, ఉపాధ్యాయులు రమేష్ పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు.

జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు జగత్‌పల్లి విద్యార్థిని ఎన్నిక



జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎన్నికైన భువనేశ్వరి

వనపర్తి రూరల్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : పెద్దమందడి మండలం జగత్‌పల్లికి చెందిన విద్యార్థిని భువనేశ్వరి డిసెంబరులో హర్యానాలో జాతీయ స్థాయిలో జరగబోయే సైన్స్‌ఫేర్‌కు శనివారం ఎన్నికైంది. మూడు నెలల కిందట విజయవాడలో నిర్వహించిన దక్షిణ భారతదేశ సైన్స్‌ఫేర్‌లో ఆమె పాల్గొని కాస్ట్ ఎయిర్ ప్యూరిఫైయర్ పై ప్రదర్శన ఇచ్చింది. దీంతో ఆమెను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. విద్యార్థిని జగత్‌పల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో గైడ్ టీచర్ జ్యోతిర్మయిని గ్రామస్తులు, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలు తెలపండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు అంశంపై ఏపీఎంలు, పీఏసీఎస్‌ల సీఈవోలతో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా మొత్తం ఎన్ని పీఏసీఎస్ లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి, ఇంకా ఎన్ని పీఏసీఎస్‌లు ప్రారంభం కావాల్సి ఉందనే విషయాలపై ఆరా తీశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు విషయంలో ఏ ఇబ్బంది సమస్యలు ఉన్నా.. వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏ కొనుగోలు కేంద్రంలోనూ ధాన్యం తీసుకోవడంలో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. తూకాలు, గన్నీ బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, కాలిబర్ మీటర్లు ఇంకా ఏవైనా అవసరమైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

గంజాయిని నిర్మూలిద్దాం..

పాన్‌గల్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ శనివారం డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థుల మేధస్సు ఆలోచనలు, సమాజం అభివృద్ధి వైపు ఉండేలా చదువులు కొనసాగించాలన్నారు. సమాజంలో విద్యార్థులు యువత చెడు మార్గం వైపు వ్యసనాలకు బానిస అవుతున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రేవయ్య, భారత ప్రజాతంత్ర సమాఖ్య మండల కార్యదర్శి కమలాకర్, సీపీఎం పార్టీ మండల నాయకులు బీచుపల్లి, రాములు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వే

అమరచింత, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే శనివారం ఆయా గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మునిసిపాలిటీ కేంద్రంతో పాటు నాగల్‌కడుమూర్, నందిమల్ల, ఖ్యుపల్లి, మిట్టనందిమల్ల, చంద్రఘడ్, నందిమల్ల ఎక్స్‌రోడ్డు, పామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో సర్వే విజయవంతంగా కొనసాగింది. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం శ్రీనివాసులు, ఆర్ఐ గోపాల్, ఎంపీవో నరసింహయ్య, ఎంఈవో బాస్కర్ సింగ్ పర్యవేక్షించారు.

ప్రతీ పౌరుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతీ పౌరుడికి నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రభుత్వమే పూర్తి బాధ్యతతో అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు డీఎస్పీ నాయకులు మీడియాతో మాట్లాడారు. ప్రజా పాలన అంటూ కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని విద్యార్థులందరికీ నాణ్యమైన ఉచిత విద్యను కల్పించాలని, మూడున్నర కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఉపాధి అవకాశాలు ప్రభుత్వమే కల్పించాలన్నారు. రాష్ట్రంలో నిరుపేదలు జీవిస్తున్నటువంటి ప్రజలకు నీటి సౌకర్యంతో కలిగిన ఎకరం భూమిని, నాలుగు గదుల ఇంటిని ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు మేనిఫెస్టో 6 గ్యారెంటీలను కాదని, మనిషి జీవితంలో మౌలికమైన మార్పులు జరిగే విధంగా నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధితో పాటు భూమి, ఇల్లు ఈ ఐదు గ్యారెంటీలను ప్రభుత్వం అందించాలన్నారు. దీనిపై ఈ నెల 18 న కలెక్టరు, 19, 20న తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలు కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

పెబ్బేరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తిప్పాయిపల్లిలో మాజీ సర్పంచ్ పద్మమ్మ కుమారుడి వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని తీసుకొస్తున్నా.. తూకాలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, మాజీ జడ్పీటీసీ పద్మ, మాజీ సర్పంచ్ పద్మ, నాయకులు వెంకటేష్, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మండల గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

పెబ్బేరు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : కల్లు గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ కోరారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కుల వృత్తిలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చేపట్టిన కృషి అభినందనీయమని అన్నారు. గీత కార్మికులకు తాడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధికారం పదవులు తీసుకు వచ్చారు. రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఈత చెట్లు పెంచడానికి గ్రామానికి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని ఎన్నికల ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. గౌడ సంఘం నాయకులు ఉమేష్ గౌడ్, రాజు గౌడ్, ప్రభాకర్ గౌడ్, రంగస్వామి గౌడ్, సాయితేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.